
'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు. పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు ఉన్నత చదువులు చదవాలి.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 10+8 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 195

శనివారం 5-10-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'గుట్ట'కాయస్వాహా!
ప్రభుత్వ భూముల్లో ఉన్న గుట్టలను అక్రమార్కులు స్వాహా చేస్తున్నారు. -2లో



ఉగాండ ప్రతినిధుల సందడి
నల్లవాగు వద్ద ఉగాండ దేశ ప్రతినిధులు, శాస్త్రవేత్తలు సందడి చేశారు. -2లో

న్యూస్‌రీల్

'స్వానిధి'తో మరింత లబ్ధి


మాట్లాడుతున్న మెప్మా పీడీ ఇందిరా

మెదక్ కలెక్టరేట్: ప్రధాన మంత్రి స్వానిధి యోజన పథకం ద్వారా స్ట్రీట్ వెండర్లకు మరింత లబ్ధి చేకూరుతుందని మెప్మా పీడీ ఇందిరా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సిబ్బందితో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బ్యాంకుల ద్వారా రుణాలు పొందిన స్ట్రీట్ వెండర్ల కుటుంబాలకు ఆర్థిక ప్రయోజనాల కోసం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రోడ్ల పక్కన, వీధుల వెంట దుకాణాలను ఏర్పాటు చేసుకునే వారికి ఆర్థిక సహాయం అందించడం పీఎం స్వానిధి ముఖ్య ఉద్దేశం అని వివరించారు.

పంచాయతీ ట్యాంకర్ వాడొద్దు


చిట్కుల్‌లో పర్యటిస్తున్న డీపీఓ యాదయ్య

చిలప్‌చెడ్(నర్సాపూర్): పంచాయతీ వాటర్ ట్యాంకర్‌ను అత్యవసర పరిస్థితుల్లో తప్ప, ప్రతి చిన్న పనికి వాడొద్దని జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని చిట్కుల్‌లో పర్యటించారు. పల్లె ప్రకృతి వనం, నర్సరీని పరిశీలించి పంచాయతీ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. గ్రామంలో నీటి పారుదల కాలువ పక్కన ఉన్న గడ్డిని తొలగించాలని సూచించారు. మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా అవుతుండగా, ట్యాంకర్‌తో నీటి సరఫరా ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. పంచాయతీకి వచ్చే పెండింగ్ బిల్లుల గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, ఎంపీఓ శరత్‌కుమార్, ఏపీఓ శ్యాం, పంచాయతీ కార్యదర్శి తిరుపతి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పక్కాగా ధ్రువపత్రాల పరిశీలన

మెదక్‌జోన్: డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ పకడ్బందీగా జరగాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులకు సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న సర్టిఫికెట్ల పరిశీలన కేంద్రాన్ని సందర్శించి మాట్లాడారు. ఈనెల 5వ తేదీ వరకు మాత్రమే అవకాశం ఉన్నందున ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. డీఎస్సీకి 704 మంది అభ్యర్థులు ఎంపిక కాగా 1: 3 నిష్పత్తిలో ధ్రువపత్రాల పరిశీలన కొనసాగుతుందన్నారు. ప్రస్తుతం 13 కౌంటర్లలో ప్రక్రియ సాగుతుండగా, అవసరమైతే మరిన్ని కౌంటర్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో డీఈఓ రాధాకిషన్, ఎంఈఓలు, గెజిటెడ్ హెచ్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

గాయత్రీదేవిగా దుర్గమ్మ

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల్లో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం దుర్గమ్మ గాయత్రీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని గులాబీ రంగు వస్త్రాలతో అలంకరించారు. ఉదయం అర్చకులు అమ్మవారి ఉత్సవ విగ్రహానికి గోకుల్ షెడ్డులో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పూజలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈఓ చంద్రశేఖర్, ఆలయ సిబ్బంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు. సింగూరు నుంచి 22 వేల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేయడంతో ఏడుపాయల జలదిగ్బంధంలో చిక్కుకుంది. దీంతో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రాజగోపురంలో ఉంచి పూజలు చేస్తున్నారు. శనివారం మూడో రోజు అమ్మవారు అన్నపూర్ణ అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.


పూజలు నిర్వహిస్తున్న భక్తులు

అమానవీయ హత్యలు!

పల్లెల్లో మూఢత్వం.. కానరాని మానవత్వం
- మంత్రాల నెపంతో దారుణాలు
- నెల వ్యవధిలోనే మూడు ఘటనలు
- ఇద్దరు మృత్యువాత


టేక్మాల్: మంత్రాల నెపంతో దాడి చేయగా మరణించిన రాములు, పక్కన బాధితురాలు (ఫైల్)


కాట్రియాలలో జరిగిన సంఘటనపై గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్‌జోన్: శాస్త్ర, సాంకేతిక రంగంలో ఎంతో అభివృద్ధి సాధించిన ప్రస్తుత తరుణంలో గ్రామీణ ప్రాంతాల్లో నేటికీ మూఢ నమ్మకాలను విశ్వసిస్తున్నారు. మంత్రాల నెపంతో సాటివారిపై దాడులకు దిగుతున్నారు. దాడుల్లో కొందరు గాయాలతో బయటపడుతుండగా, మరికొందరు చేయని తప్పుకు బలవుతున్నారు. జిల్లాలో కేవలం నెల వ్యవధిలో మూడు ఘటనలు చోటు చేసుకోవడం ఇందుకు నిదర్శనం.

రోజురోజుకు పెరుగుతున్న దాడులు

జిల్లాలో మంత్రాల పేరుతో రోజురోజుకు దాడులు పెరుగుతున్నాయి. నెల వ్యవధిలో మూడు ఘటనలు చోటు చేసుకున్నాయి. ఇందులో ఆరుగురిపై దాడి చేయగా, ఒకరిని దారుణంగా కొట్టి హత్యచేశారు. తాజాగా మరో మహిళపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. అడ్డుకోవాల్సిన గ్రామస్తులు మనకెందుకులే అని చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. కనీసం పోలీసులకు కూడా సమాచారం ఇవ్వడం లేదు. కఠిన శిక్షలు పడతాయని తెలిసినా క్షణికావేశంలో కొందరు దాడులకు తెగబడుతున్నారు.

జిల్లాలో వరుస ఘటనలు

- గత నెల సెప్టెంబర్ 3న టేక్మాల్ మండలం గొల్లగూడెంలో మంత్రాల నెపంతో కొల్చారం మండలం ఏటిగడ్డ కిష్టాపూర్‌కు చెందిన దేవుని కాడి రాములు (52) గొల్లగూడెంకు చెందిన బురుజుకాడి గంగవ్వ, సంగారెడ్డి జిల్లా నిజాంపేటకు చెందిన బాలమణిపై గొల్లగూడెం గ్రామానికి చెందిన ఐదుగురు విచక్షణారహితంగా దాడి చేశారు. దాడిలో రాములు అక్కడికక్కడే మృతిచెందగా, ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారిని పోలీసులు సకాలంలో ఆస్పత్రికి తరలించగా ప్రాణాలతో బయటపడ్డారు. ఈ ఘటనలో ఐదుగురిపై కేసు నమోదైంది.
- ఈనెల 1వ తేదీన రామాయంపేట మండలం ప్రగతి ధర్మారం గ్రామానికి చెందిన గుర్రం విజయ, ఆమె భర్త సిద్ధిరాములు మంత్రాలు చేస్తున్నారని అదే గ్రామానికి చెందిన 14 మంది ఇద్దరిని చెట్టుకు కట్టేసి దాడి చేశారు. వారిని హత్య చేసేందుకు యత్నించారు. విషయం పోలీసులకు తెలియడంతో సకాలంలో గ్రామానికి చేరుకొని వారిని విడిపించారు. ఈ ఘటనలో 14 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు.
- తాజాగా శుక్రవారం రామాయంపేట మండలం కాట్రియాల్‌కు చెందిన డ్యాగల ముత్తవ్వ (55)ను మంత్రాల నెపంతో అదే గ్రామానికి చెందిన కొందరు దాడి చేసి ఒంటిపై పెట్రోల్ పోసి తగులబెట్టారు. కొన ఊపిరితో ఉన్న వృద్ధురాలిని పోలీసులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈఘటనలో ఇప్పటివరకు ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

అత్యంత హేయమైన చర్య: ఎస్పీ

రామాయంపేట(మెదక్): మంత్రాల నెపంతో మహిళను దారుణంగా హత్య చేయడం అత్యంత హేయమైన చర్య అని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం డీఎస్పీ వెంకట్‌రెడ్డితో కలిసి కాట్రియాల గ్రామాన్ని సందర్శించారు. బాధిత మహిళ ఇంటిని పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడారు. ఇంకా మూఢ నమ్మకాలను నమ్మడం బాధాకరమన్నారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో పోలీస్‌శాఖ పలు చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నా ప్రజలు మారకపోవడం సరికాదన్నారు. ఉరిశిక్ష అమలైతే తప్ప ఇలాంటి సంఘటనలు నియంత్రణలోకి రావన్నారు. గ్రామాల్లో యువకులు, ప్రజాసంఘాలు ప్రజలను చైతన్యపర్చాలని సూచించారు. పోలీసులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈకేసులో ప్రమేయం ఉన్న వారందరిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. మూఢ నమ్మకాలపై త్వరలో గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఎస్పీ వెంట సీఐ వెంకట్‌రాజాగౌడ్ సిబ్బంది ఉన్నారు.

అవగాహన కార్యక్రమాలు ఏవీ?

ఇంత జరుగుతున్నా మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా జిల్లాలో అధికారులు ఎలాంటి అవగాహన కార్యక్రమాలు చేపట్టడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. జన విజ్ఞాన సదస్సులు, కళా బృందాలతో ప్రజలను చైతన్యవంతులను చేయాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు.

ఒక కుటుంబం.. ఒకే కార్డు

- అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు
- క్షేత్రస్థాయిలో ఎఫ్‌డీసీ సర్వే పరిశీలన

మెదక్ మున్సిపాలిటీ: ఒక కుటుంబం.. ఒకే కార్డు లక్ష్యంగా సర్వే కొనసాగుతుందని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని పత్తేనగర్ 20వ వార్డులో ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్వయంగా కుటుంబ సభ్యుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సర్వే పకడ్బందీగా చేయాలని అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. బీపీఎల్, ఏపీఎల్‌తో సంబంధం లేకుండా ఒక కుటుంబానికి ఒక గుర్తింపు కార్డును ప్రభుత్వం అందజేస్తుందన్నారు. మున్సిపాలిటీ పరిధిలో 289 కుటుంబాలు లక్ష్యంగా నాలుగు బృందాలుగా విడిపోయి సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలంతా సర్వేకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మణ్‌బాబు రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

క్రీడాకారులు ప్రపంచస్థాయికి ఎదగాలి

మెదక్ కలెక్టరేట్: క్రీడాకారులు పల్లెల నుంచి ప్రపంచస్థాయికి ఎదగాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం సాయంత్రం మంభోజిపల్లి బ్రిడ్జి నుంచి మెదక్ అవుట్ డోర్ స్టేడియం వరకు సీఎం కప్ ర్యాలీని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో సీఎం కప్ పేరుతో క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల నిర్వహణ అధికారి దామోదర్‌రెడ్డి, క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మీటర్ల ఏర్పాటుకు చర్యలు

- జిల్లాలో విద్యుత్ కనెక్షన్ పొందని కుటుంబాలు 23 వేలు
- ఈనెల 15 వరకు గుర్తింపు సర్వే
- ట్రాన్స్‌కో ఎస్ఈ శంకర్

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో ఇప్పటివరకు విద్యుత్ కనెక్షన్ పొందని నిరుపేద ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు 23 వేల వరకు ఉంటాయని, ఈనెల 15వ తేదీ వరకు సర్వే పూర్తిచేసి వారికి మీటర్లు అందజేస్తామని ట్రాన్స్‌కో ఎస్ఈ శంకర్ తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. గృహజ్యోతి పథకంలో ఇంకా లబ్ధిపొందని అర్హుల జాబితా రూపొందించాలని ట్రాన్స్‌కో సీఎండీ ఆదేశించినట్లు చెప్పారు. జిల్లాలోని అర్హులైన లబ్ధిదారులు మీటర్ల కోసం ట్రాన్స్‌కో ఏఈలను సంప్రదించాలని సూచించారు. జిల్లాలో ప్రస్తుతం గృహజ్యోతి పథకం కింద 1.24 లక్షల కుటుంబాలు లబ్ధిపొందుతున్నాయని వివరించారు. వీటికి నెలకు రూ.23 కోట్లు ఖర్చు అవుతుందన్నారు. అలాగే జిల్లాలో నాయీబ్రాహ్మణ వృత్తిదారుల కనెక్షన్లు 783, రజక వృత్తిదారులకు సంబంధించి 2,347 కనెక్షన్లు ఉన్నాయన్నారు. జిల్లాలో 1,80,445 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని, వాటికి కూడా ఉచిత కరెంట్ సరఫరా జరుగుతుందన్నారు. అలాగే జిల్లాలో 2,392 పరిశ్రమలకు విద్యుత్ సరఫరా జరుగుతున్నట్లు స్పష్టం చేశారు.


మాట్లాడుతున్న ట్రాన్స్‌కో ఎస్ఈ శంకర్


బతుకమ్మ ఆడుతున్న మహిళా కండక్టర్లు

బతుకమ్మ సంబురాలు

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ డిపోలో శుక్రవారం బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. డిపో మేనేజర్ సురేఖ ఆధ్వర్యంలో మహిళా కండక్టర్లు రంగు రంగుల పూలతో తయారు చేసిన బతుకమ్మలను డిపో నుంచి కొత్త బస్టాండ్ ఆవరణకు తీసుకొచ్చారు. అక్కడ ఆర్టీసీ సంస్థ ప్రయాణికులకు అందిస్తున్న సౌకర్యాలతో కూడిన పాటలు పాడుతూ ఆడిపాడారు. అంతకుముందు మెదక్- సికింద్రాబాద్ రూట్ లగ్జరీ బస్సులో ప్రయాణించిన మహిళా ప్రయాణికులకు సంబంధించిన లక్కీ డ్రా నిర్వహించారు.

వెయ్యి ఎకరాల్లో పండ్ల తోటలు

డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు

చిన్నశంకరంపేట(మెదక్): జిల్లాలో వెయ్యి ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఈజీఎస్, గ్రామ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో ఈజీఎస్ పనులను గుర్తించే క్రమంలో రైతులకు ప్రయోజనం కలిగించే పనులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. వచ్చే బడ్జెట్‌లో 60 శాతం సుస్థిర ఆస్తులను పెంపొందించే పను లు చేపట్టేలా ప్రణాళిక ఉండాలని సూచించారు. అదే సమయంలో కూలీలకు వంద రోజుల ఉపా ధి కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దామోదర్, ఏపీఓ రాజ్‌కుమార్, ఎంపీఓ గిరిజారాణి పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి చర్యలు

పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

రామాయంపేట(మెదక్): రాష్ట్రంలో కాంగ్రెస్‌ను మరింతగా బలోపేతం చేసే దిశగా ముందుకెళ్తున్నామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. శుక్రవారం నిజామాబాద్ పర్యటనకు వెళ్తున్న క్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి రామాయంపేటలో కొద్దిసేపు ఆగి మాట్లాడారు. కార్యకర్తలను గుండెల్లో పెట్టుకొని చూసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి సుప్రభాత రావు, రాష్ట్ర అధికార ప్రతినిధి రామచందర్ గౌడ్, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి యాదగిరియాదవ్, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు నరేందర్, మాజీ ఎంపీపీలు, రమేశ్‌రెడ్డి, సిద్దరాంలు, అమరసేనారెడ్డి, రాజిరెడ్డి, నార్సింగి మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. కాగా పీసీసీ అధ్యక్షుడిని సన్మానిస్తున్న క్రమంలో జేబుల్లో నుంచి డబ్బులు అపహరణకు గురయ్యాయని కొందరు నాయకులు వాపోయారు.

ఘనస్వాగతం పలికిన నాయకులు

మనోహరాబాద్(తూప్రాన్): జిల్లా మీదుగా నిజామాబాద్ వెళ్తున్న పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు డీసీసీ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, నర్సారెడ్డి ఆధ్వర్యంలో కాళ్లకల్ వద్ద ఘనస్వాగతం పలికారు. అనంతరం బంగారమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పూజల హరికృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, రాజిరెడ్డి, ఎలక్షన్‌రెడ్డి, భూంరెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు మల్లారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, గోపాల్, నర్సింహాచారి, సత్యనారాయణ, శ్రీనివాస్, నర్సింలుగౌడ్, కృష్ణాగౌడ్, నర్సింహ, నాగ రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


రామాయంపేట: కార్యకర్తలకు అభివాదం చేస్తున్న మహేశ్‌కుమార్‌గౌడ్

దసరాకు ప్రత్యేక బస్సులు



- 542 సర్వీసులు నడుపుతున్న ఆర్టీసీ
- నేటి నుంచి 11 వరకు..

డిపో	మొత్తం సర్వీసులు	ప్రత్యేక బస్సులు
నారాయణఖేడ్	55	15
మెదక్	96	11
నర్సాపూర్	24	5
సంగారెడ్డి	86	18
జహీరాబాద్	85	20
సిద్దిపేట	97	12
గజ్వేల్-ప్రజ్ఞాపూర్	66	14
దుబ్బాక	33	4

నారాయణఖేడ్: బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులు నడిపేందుకు సమాయత్తం అయ్యింది. ఈనెల 5 నుంచి 11వ తేదీ వరకు ఈ ప్రత్యేక సర్వీసులు నడపనున్నారు. ఉమ్మడి మెదక్ రీజియన్ పరిధిలో మొత్తం 542 ప్రత్యేక బస్సు సర్వీసులు నడిపేందుకు సంస్థ సిద్ధమైంది. ఇందులో ఆర్టీసీ సంస్థకు చెందిన సర్వీసులు 334 కాగా, హైర్ సర్వీసులు 208 నడవనున్నాయి. ఆర్టీసీ అధికారులు ప్రత్యేక సర్వీసులు నడిపేందుకు అవసరమైన ప్రణాళికను రూపొందించారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి ప్రత్యేక సర్వీసులు ప్రారంభమవుతాయి. ఉమ్మడి జిల్లాలోని డిపో కేంద్రాల నుంచి హైదరాబాద్‌తోపాటు ముఖ్య పట్టణాలకు నడవనున్నాయి. జిల్లాలోని మెజార్టీ జనాలు హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో కర్మాగారాలు, చిరు వ్యాపారాలు, చిరు ఉద్యోగాలు, ఇతరత్రా పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరందరూ అతి పెద్దపండగైన దసరాకు తప్పకుండా తమ స్వగ్రామాలకు వెళ్తారు. ఇప్పటికే ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయి పాఠశాలలకు సెలవులు ఇవ్వగా, కళాశాలలకు ఒకటి, రెండు రోజుల్లో సెలవులు ఇస్తారు.

రద్దీ పెరిగితే అదనపు సర్వీసులు

ప్రస్తుతం ప్రత్యేక సర్వీసులతోపాటు రద్దీ పెరిగిన పక్షంలో మరిన్ని అదనపు సర్వీసులు నడిపేందుకు సైతం ఆర్టీసీ సిద్ధమైంది. రీజియన్ పరిధిలోని డిపోల్లో ఉన్న సర్వీసులు సరిపోని పక్షంలో సిటీ సర్వీసులను సైతం రప్పించి ప్రయాణికులను చేరవేసేందుకు ప్రణాళికను రూపొందించారు. ముఖ్యంగా 9, 10, 11వ తేదీల్లో రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉంది. ఈ తేదీల్లో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అదనపు సర్వీసులు నడిపేందుకు ప్రయత్నం చేస్తున్నారు. పండుగ అనంతరం ప్రయాణికులు తిరుగు ప్రయనమవుతారు. దీంతో 13 నుంచి ప్రత్యేక సర్వీసులు నడపనున్నారు.

సర్వీసులు ఇలా..

నారాయణఖేడ్ డిపోకు సంబంధించి జేబీఎస్, సికింద్రాబాద్, లింగంపల్లి, పటాన్‌చెరు, జహీరాబాద్ డిపో.. జేబీఎస్, లింగంపల్లి, సంగారెడ్డి క్రాస్‌రోడ్, సంగారెడ్డి డిపో జేబీఎస్, సికింద్రాబాద్, గజ్వేల్- ప్రజ్ఞాపూర్ డిపో.. సికింద్రాబాద్, మెదక్ డిపో.. సికింద్రాబాద్, బాల్‌నగర్ వయా నర్సాపూర్, సిద్దిపేట డిపో.. జేబీఎస్, కరీంనగర్, వేములవాడ, దుబ్బాక డిపో.. సికింద్రాబాద్, నర్సాపూర్ డిపో.. జేబీఎస్, బాలానగర్‌కు ప్రత్యేక సర్వీసులు నడపనున్నారు. దీంతోపాటు అవసరమైతే అదనపు రూట్‌లలో కూడా రద్దీకి అనుగుణంగా సర్వీసులు నడుపుతారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలు సైతం ఈ ప్రత్యేక బస్సు సర్వీసుల్లో ప్రయాణించేందుకు అనుమతిస్తున్నారు.

సర్వీసులను పర్యవేక్షించనున్న డీఎంలు

డీఎం	మొబైల్ నంబరు
జహీరాబాద్	9959226269
నారాయణఖేడ్	9959223170
సంగారెడ్డి	9959226267
గజ్వేల్- ప్రజ్ఞాపూర్	9959226270
మెదక్	9959226268
సిద్దిపేట, దుబ్బాక	9959226271
నర్సాపూర్	9959226268

ప్రత్యేక సర్వీసులు సిద్ధం



రీజియన్ పరిధిలోని 8 డిపోల నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడిపేందుకు సిద్ధంగా ఉన్నాం. ఆర్టీసీకి చెందిన 334 సర్వీసులు, హైర్ బస్సులు 208 నడపనున్నాం. అన్ని డిపోల డీఎంలు ప్రత్యేక సర్వీసులు నడిపేందుకు సన్నద్ధమై ఉన్నారు. ప్రయాణికులు ఇబ్బందులు కలుగకుండా వారి రద్దీకి అనుగుణంగా మరిన్ని సర్వీసులు అవసరమైతే నడుపుతాం. చార్జీలు మాత్రం 1.25శాతం అదనంగా ఉంటాయి.

– ప్రభులత, ఆర్ఎం, సంగారెడ్డి

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి పోటీల్లో క్రీడాకారుల సత్తా


బహుమతులతో క్రీడాకారులు

నారాయణఖేడ్‌: ఖేడ్ పట్టణంలోని ఈ తక్షిల పాఠశాల గ్రౌండ్‌లో రాష్ట్ర షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి బాలబాలికల షూటింగ్ బాల్ పోటీలు శుక్రవారం ముగిశాయి. పోటీల్లో 31 జిల్లాల నుంచి బాలబాలికలు పాల్గొన్నారు. బాలుర విభాగంలో సంగారెడ్డి జిల్లా ప్రథమ, మహబూబాబాద్ ద్వితీయ, గద్వాల తృతీయ, భూపాలపల్లి నాలుగో బహుమతి సాధించాయని పీఈటీల అసోసియేషన్ అధ్యక్షుడు మారుతీ తెలిపారు. బాలికల విభాగంలో సంగారెడ్డి జిల్లా ప్రథమ, మహబూబాబాద్ ద్వితీయ, నల్గొండ తృతీయ, కామారెడ్డి జిల్లా నాల్గో బహుమతి పొందినట్లు పేర్కొన్నారు.

కుదిరిన పరస్పర అవగాహన ఒప్పందం


ఒప్పంద పత్రాలను చూపుతున్న అధికారులు

ములుగు(గజ్వేల్‌): ములుగు కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం(ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ) హైదరాబాద్‌కు చెందిన వీవీయో గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్‌ల మధ్య శుక్రవారం పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ములుగు వైస్ చాన్స్‌లర్ డాక్టర్.బీ నీరజప్రభాకర్, వీవీయో గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ మధుసూధన్‌రావు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. ఉద్యాన పంటల్లో కోరియన్ సాంకేతికతలను ధ్రువీకరించడం, రైతులు, ఎఫ్‌పీఓలు పరస్పర సంబంధిత రంగాల్లో పరిశోధన సహకారాలతో సహా ఉద్యానవనంపై ఆసక్తిని కలిగి ఉన్న వివిధ వాటాదారులకు శిక్షణ ఇవ్వడం ఈ ఒప్పందం యొక్క ప్రధాన ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు భగవాన్, రాజశేఖర్, విజయ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

డిజిటల్ కార్డు సర్వే ప్రారంభం

జహీరాబాద్ టౌన్‌: ప్రతి ఒక్కరికీ హెల్త్ ప్రొఫైల్ కోసం ఫ్యామిలీ డిజిటల్ యూనిక్ కార్డులను జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జహీరాబాద్ పట్టణంలో శుక్రవారం అధికారులు సర్వే ప్రారంభించారు. పట్టణంలోని శాంతినగర్‌ను పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేశారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, రెవెన్యూ అధికారులు శాంతినగర్‌లో ఇంటింటికీ తిరిగి సర్వే చేపట్టారు. కుటుంబ సభ్యుల డేటాను సేకరిస్తూ వివరాలను నమోదు చేసుకుంటున్నారు. మొగుడంపల్లి మండలంలోని గౌసాబాద్ గ్రామంలో కూడా డిజిటల్ కార్డు సర్వే ప్రారంభమైంది. గ్రామాన్ని కూడా పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసి రెవెన్యూ, పంచాయతీ అధికారులు బృందాలుగా ఏర్పడి సర్వే నిర్వహిస్తున్నారు.

'గుట్ట'కాయస్వాహా!



గుట్టలను బ్లాస్టింగ్ చేసి మట్టి తవ్వకాలు

- ప్రభుత్వ భూములు ఆక్రమణ
- వన్యప్రాణులకు తప్పని ముప్పు
- వాల్టా చట్టానికి తూట్లు, ఊసేలేని ఇరిగేషన్ చట్టాలు
- ఆక్రమణదారులను కట్టడిచేయని అధికారులు

హుస్నాబాద్‌రూరల్‌: హుస్నాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలో మొరం అక్రమ దందా జోరుగా సాగుతోంది. రోడ్డు పనులకు పేరుతో మొరం మట్టిని తరలించుకుపోతున్నారు. గుట్టలు, ప్రభుత్వ భూములు ఆనవాళ్లు కోల్పోతున్నా.. సంబంధిత అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడడం లేదు.కొద్దిరోజులగా తవ్వకాలు జరుగుతుండంతో ప్రకృతి సంపదకు చెందిన విలువైన గుట్టలు మాయం అవుతున్నాయి. హుస్నాబాద్ రెవెన్యూ డివిజన్ కేంద్రానికి 5 కిలో మీటర్ల దూరంలోని ఉమ్మాపూర్ అటవీ ప్రాంతం 3,200 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. సిద్దిపేట, హన్మకొండ రవాదారికి గుట్టలు సమీపంలోనే ఉండటంతో హన్మకొండ, కరీంనగర్, సిద్దిపేట జిల్లాలో జరుగుతున్న రోడ్డు పనులకు కూడా ఇక్కడి మట్టినే గుత్తేదారులు తరలిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. నాగారం, పోతారం(ఎస్), ఉమ్మాపూర్ మూడు గ్రామాల సరిహద్దులోని సర్వే నంబరు 54లోని ప్రభుత్వ భూమిలో గుత్తేదారులు అనుమతుల పేరుతో గుట్టలను తవ్వి మట్టి దందా చేస్తున్నారు.

ప్రభుత్వ భూములు కబ్జా

మట్టి వ్యాపారులు గుట్టలను తవ్వుతుంటే సమీప రైతులు, బడా బాబులు ప్రభుత్వ భూములను ఆక్రమించి భూముల సరిహద్దులను మార్చేస్తున్నారు. పోతారం(ఎస్), నాగారం సరిహద్దులోని బైరోని చెరువు కట్ట పక్కనే మట్టి తవ్వకాలు జోరుగా సాగడంతో వ్యవసాయ బావుల వద్దకు వెళ్లే రోడ్లు పూర్తిగా ధ్వంసమై రైతులు ప్రమాదాలకు గురవుతున్నారు. బైరోని చెరువుకు మీదికి గుట్టలను బ్లాస్టింగ్ చేయడంతో అక్కడ వెలువడిన విషరసాయనాలు అడవి జంతువుల ప్రాణాలను హరిస్తున్నాయి. బాంబుల బ్లాస్టింగ్స్‌తో పర్యావరణానికి హాని కలగడంతో పాటు వన్యప్రాణులు మృత్యువాత పడుతున్నాయి.

చట్టాలు గాలికి..

హైదరాబాద్ నగర పరిరక్షణకు హైడ్రాకు సర్వ అధికారులను కట్టబెట్టిన ప్రభుత్వం పల్లెల్లో చెరువులు, కుంటలు, అడవుల పరిరక్షణను గాలికి వదిలేస్తుంది. అటవీ పరిరక్షణ కోసం 2002లో తెచ్చిన వాల్టా చట్టానికి అధికారులు తూట్లు పొడవడంతో కలప అక్రమ రవాణ, వాగుల్లో ఇసుక తవ్వకాలు కొనసాగుతున్నాయి. వాల్టా చట్టం నిబంధనలను ఇప్పుడు హైడ్రాకు కట్టబెట్టారు. 1905 భూఅక్రమణ చట్టంలోని కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దారు, నయాబ్ తహసీల్దార్లకు ఇచ్చిన అధికారాలను ఇప్పుడు హైడ్రాకు ఇచ్చారు. సర్వ అధికారులతో హైడ్రా హైదరాబాద్ పట్టణ పరిరక్షణకు చర్యలు తీసుకుంటుంటే, పల్లెలో పర్యావరణాన్ని పరిరక్షించే వాల్టా చట్టం, భూ ఆక్రమణ చట్టాలను అధికారులు గాలికి వదిలేయడంతో అక్రమార్కులు గుట్టలను కొల్లగొట్టి చెరువులను చెరబడుతున్నారు.

ప్రభుత్వ భూములను రక్షించాలి



మీర్జాపూర్ గట్టులకు మట్టిని తవ్వి ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మట్టి తవ్విన భూములను కొందరు ఆక్రమించి కబ్జా చేస్తున్నారు. సెలకలోని చెట్లను తీసేయడంతో పశువుల మేతకు భూములు లేకుండా పోతున్నాయి. గుట్టలకు బ్లాస్టింగ్స్ చేయడంతో అడవి పందులు పంట చేళ్లలకు వస్తున్నాయి. అధికారులు మట్టి తవ్వకాలను అరికట్టి ప్రభుత్వ భూములను రక్షించాలి.

వేల్పుల సంపత్, మీర్జాపూర్

రోడ్లకు మట్టి లేదన్నారు



మా ఊరి వీధుల్లో గుంతలు పడి ప్రజలకు ఇబ్బంది పడుతున్నారు. మట్టి తవ్వకొని పోస్తామంటే అనుమతులు లేవన్నారు. ఇప్పుడు ఎల్కతుర్తి, కరీంనగర్ ఫోర్ వే లైన్ రోడ్డుకు మా ఊరి గుట్టల మట్టిని తవ్వకపోతున్నారు. హన్మకొండ జిల్లాలో మట్టి లేదా మా ఊరు పచ్చటి గుట్టలను బొందల గడ్డ చేసింర్రు. పోతారం, నాగారం మధ్య రాష్ట్రంలో మొదటిసారి కొబ్బరి పీచ్చుతో తారు రోడ్డు వేసింర్రు. మట్టి ట్రిప్పర్లు పోవడంతో రోడ్డు మొత్తం గుంతలుగా మారింది.

– బత్తిని సాయిలు, మాజీ సర్పంచ్ పోతారం

అనుమతులు తీసుకున్నారు



పోతారం(ఎస్) బైరోని చెరువు దగ్గర గుట్టకు మైనింగ్ శాఖ అనుమతులు తీసుకొని ఎల్కతుర్తి, కరీంనగర్ నేషనల్ హైవే రోడ్డు పనులకు తరలిస్తున్నారు. ప్రైవేటు వ్యక్తులు మట్టి తరలిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ భూముల హద్దులు మార్చితే సర్వే చేసి భూముల హద్దులు ఏర్పాటు చేస్తాం.

– రవీందర్‌రెడ్డి, తహసీల్దార్, హుస్నాబాద్

చేపల వేటకు వెళ్లి యువకుడి మృతి


రాజు (ఫైల్)

సిద్దిపేటకమాన్‌: చెరువులో చేపల వేటకు వెళ్లి యువకుడు మృతి చెందిన ఘటన పట్టణ పరిధిలోని నర్సాపూర్‌లో చోటు చేసుకుంది. సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ కథనం మేరకు.. సిద్దిపేట పట్టణం నర్సాపూర్‌కు చెందిన రెడ్డిమల్ల రాజు (34) మేస్త్రి పని చేస్తూ కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. 2న రాత్రి రాజు స్థానిక చెరువులో చేపలు పట్టడానికి వెళ్లాడు. ఈత రాకపోవడంతో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. కుమారుడు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతకగా చెరువు గట్టుపై బైక్, చెప్పులు, దుస్తులు కనిపించడంతో చెరువులో వెతకగా శుక్రవారం మృతదేహం లభ్యమైంది. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ

మనోహరాబాద్(తూప్రాన్):గుండె పోటుతో ఉపాధి కూలీ మృతి చెందిన ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామానికి చెందిన చీర్ల సత్తయ్య యాదవ్ (56) తోటి కూలీలతో కలిసి గ్రామ శివారులోని నర్సరీలో రోజువారిగా పనులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఒక్కసారి కింద పడటంతో తోటి కార్మికులు గమనించి చికిత్స నిమిత్తం మేడ్చల్‌లోని ఓ ప్రవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే గుండె పోటుకు గురై మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కూలీ మృతితో కాళ్లకల్‌లో విషాదచాయలు అలుముకున్నాయి.

క్వారీ గుంతలో పడి వ్యక్తి..


మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

నారాయణఖేడ్‌: క్వారీ గుంతలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన ఖేడ్ మండలం హంగర్గా(కె) శివారులో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. హంగర్గా(కె) శివారులో కంకర క్రషర్ రాళ్ల కోసం తవ్వకాలు చేపట్టగా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల కురిసిన భారీవర్షాలకు అవి నీటితో నిండాయి. గ్రామానికి చెందిన చాకలి హన్మంతు (50) గురువారం బట్టలు ఉతకడానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు గుంతలో పడి గల్లంతయ్యాడు. గాలించినా ఆచూకీ లభ్యం కాకపోగా శుక్రవారం ఉదయం మృతదేహం తేలింది. ఎలాంటి ఈవిషయంలో తమకు ఫిర్యాదు రాలేదని ఖేడ్ పోలీసులు తెలిపారు.

డ్రగ్స్, సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరి

జహీరాబాద్ టౌన్‌: డ్రగ్స్, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలని తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో(టీఎస్ న్యాబ్) డీఎస్పీ పుష్పన్ కుమార్ అన్నారు. పట్టణంలోని ఓ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాలు ప్రమాదకరమన్నారు. విద్యార్థులు ఇంటర్‌నెట్‌ను వినియోగించుకోవాలి కానీ సైబర్ మోసగాళ్ల ఉచ్చులో పడొద్దని సూచించారు. బ్యాంక్ ఖాతా, ఏటీఎం పిన్ నంబర్లు, ఓటీపీలు ఎవరితోనూ షేర్ చేసుకోవద్దన్నారు. సదస్సులో సీఐ రాములు, జహీరాబాద్ టౌన్ ఎస్ఐ కాశీనాథ్, ట్రైనీ ఎస్ఐ హరిత, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పుష్పన్ కుమార్

వ్యభిచార గృహంపై దాడి

పోలీసుల అదుపులో నలుగురు విటులు, ఓ మహిళ


పోలీసుల అదుపులో విటులు

సిద్దిపేటకమాన్‌: వ్యభిచారం నిర్వహిస్తున్న ఓ ఇంటిపై పోలీసులు దాడి చేసి నలుగురు విటులతోపాటు ఓ మహిళను అదుపులోకి తీసుకున్నారు. సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ కథనం మేరకు.. సిద్దిపేట పట్టణం శివాజీ నగర్‌లో చంద్రమౌళి ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నాడనే నమ్మదగిన సమాచారం అందింది. టాస్క్‌ఫోర్స్, టూటౌన్ పోలీసులు వెళ్లి శుక్రవారం దాడి చేసి ప్రభుత్వ ఉపాధ్యాయుడైన బూర శ్రీనివాస్, మోతె వెంకటేశ్, కొత్తపల్లి శంకర్, మిద్దె ప్రసాద్, ఓ మహిళను పట్టుకున్నాం. హోమియోపతి వైద్యుడు ఉడకం చంద్రమౌళి పరారీలో ఉన్నాడు. వారి వద్ద నుంచి రూ.2వేల నగదు, 6 సెల్‌ఫోన్‌లు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

ఐఐటీహెచ్‌లో ఆఫ్ మరథాన్..



ఆరోగ్యకరమైన జీవన శైలి, శరీర దారుఢ్యంను పెంపొందించుకోవడమే లక్ష్యంగా ప్రతిష్టాత్మక విద్యా సంస్థ ఐఐటీ హైదరాబాద్ (ఐఐటీహెచ్) ఆఫ్ మారథాన్ నిర్వహించాలని నిర్ణయించింది. ఐఐటీహెచ్ రన్నర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఫస్ట్ ఎడిషన్ ఆఫ్ మారథాన్‌ను డిసెంబర్ 1న ఉదయం 5 గంటలకు ఈ మారథాన్‌ను నిర్వహిస్తున్నట్లు ఓ ప్రకటనలో ఐఐటీహెచ్ తెలిపింది. మారథాన్‌లో పాల్గొనే వారు అక్టోబర్ 31లోగా www.iithydrunnersclub.com ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొంది. 5కే రన్, 15కే రన్, 21.1కే రన్ విభాగాల్లో ఈ మారథాన్‌లు నిర్వహించనున్నారు. దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన వారు ఈ మారథాన్‌లో పాల్గొనే అవకాశాలున్నట్లు ఐఐటీహెచ్ వర్గాలు చెబుతున్నాయి.

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి :

హత్యాయత్నం కేసులో ఏడుగురు అరెస్ట్


పోలీస్‌స్టేషన్‌లో నిందితులు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని తోటపల్లి వద్ద గురువారం జరిగిన హత్యాయత్నం కేసును బెజ్జంకి పోలీసులు ఛేదించి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ క్రిష్టారెడ్డి కథనం మేరకు.. బెజ్జంకి మండల కేంద్రానికి చెందిన ప్రవీణ్ జీవనోపాధి కోసం కొన్ని నెలలుగా జగిత్యాల జిల్లా కోరుట్లలో నివసిస్తున్నాడు. ప్రవీణ్ వద్ద డబ్బులు రావాల్సి ఉండగా చందు, శ్రీనివాస్‌లు గొడవ పడ్డారు. దీన్ని మనసులో పెట్టుకొని అతడిని హత్యచేయాలనుకున్నారు. జగిత్యాల నుంచి ప్రవీణ్ కారు ప్రయాణికులను తీసుకొని హైదరాబాద్ వెళ్తున్నాడు. కరీంనగర్ జిల్లాలోని గుండ్లపల్లిలో రెండు కార్లలో బెజ్జంకికి చెందిన వేల్పుల శ్రీకాంత్, శ్రీనివాస్, చందు, సందీప్, శ్రీహరి కరీంనగర్‌కు చెందిన మహేందర్, హరీశ్ అప్పటికే కాపు కాసి ఉన్నారు. ప్రవీణ్ కారును ఫాలో చేసి బెజ్జంకి మండలంలోని తోటపల్లి వద్ద రాగానే అడ్డుకున్నారు. కారులోని ప్రయాణికులను దింపేసి ప్రవీణ్‌ను కత్తితో పొడిచి శంకర్‌నగర్ శివారులోని రాజీవ్ రహదారిపైన వదిలి వెళ్లి పోయారు. బాధితుడి ప్రశాంత్ ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఏడుగురిని అరెస్ట్ చేసి హుస్నాబాద్ కోర్టుకు తరలించినట్లు తెలిపారు.

ఆర్టీసీ బస్సు, కారు ఢీ

- మహిళ మృతి.. నలుగురికి గాయాలు


ప్రమాదంలో దెబ్బతిన్న కారు, బస్సు

కల్హేర్(నారాయణఖేడ్‌): ఆర్టీసీ బస్సు, కారు ఢీకొని ప్రమాదంలో మహిళ మృతి చెందగా, మరో నలుగురికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన నిజాంపేట మండలం మునిగేపల్లి శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. నారాయణఖేడ్ నుంచి ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో సికింద్రాబాద్ వెళ్తుంది. ఇదే సమయంలో హైదరాబాద్ నుంచి నారాయణఖేడ్‌కు ఓ కారు వస్తుంది. మునిగేపల్లి శివారులోకి రాగానే మలుపు వద్ద రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న మెదక్ జిల్లా రెగోడ్ మండలం గజ్వాడకు చెందిన భూమవ్వ(55) మృతి చెందారు. మరో నలుగురికి గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం నారాయణఖేడ్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఇంకా ఫిర్యాదు అందలేదని ఎస్ఐ వెంకటేశం తెలిపారు.

లారీని ఢీకొట్టిన డీసీఎం


ప్రమాదంలో దెబ్బతిన్న వాహనాలు

శివ్వంపేట(నర్సాపూర్) : లారీ, డీసీఎం ఢీకొన్న ఘటన తూప్రాన్- నర్సాపూర్ హైవేపై శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నర్సాపూర్ నుంచి సిరిసిల్లకు వెళ్తున్న డీసీఎం డ్రైవర్ మద్యం మత్తులో వాహనం నడుపుతూ మగ్దుంపూర్ గ్రామ శివారులోకి రాగానే ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో డీసీఎం డ్రైవర్‌కు గాయాలు కాగా స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

ఉగాండ ప్రతినిధుల సందడి


నల్లవాగు ప్రాజెక్టు వద్ద ఉగాండ దేశ ప్రతినిధులు

నల్లవాగు ప్రాజెక్టు సందర్శన

కల్హేర్(నారాయణఖేడ్‌): జిల్లాలోని మధ్య తరహా ప్రాజెక్టు నల్లవాగు వద్ద శుక్రవారం ఉగాండ దేశ ప్రతినిధులు, శాస్త్రవేత్తలు సందడి చేశారు. భారత దేశంలోని పరిశ్రమలు, రిజర్వాయర్లు, మీడియం మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు సందర్శన చేస్తున్నారు. ఉగాండ దేశ పర్మినెంట్ సెక్రటరీ కుముమన్య బెన్ నేతృత్వంలో దేశ ప్రతినిధి సిరిరి డవిడ్, క్లస్టర్ టీం లీడర్ అలున్యు డెనిస్, టెక్నికల్ అడ్వైజర్ టీబంవెండ అసుంప్ట ఇకిరిజ, చైర్ పర్సన్ ఓడోంగో డెవిడ్ కెన్నెడి, ఇంజనీర్ సెకయింగో స్టీఫెన్, ప్రాజెక్టు మెనెజ్మెంట్ స్పెషలిస్టు ఓకుము డెనిసు, జెఫ్రీ సెగమ్‌వెన్స్, డైరెక్టర్ డాక్టర్ రెబ్బి హరవ, డైరెక్టర్ బుజినెస్ లిడియ మురిమి, ప్రతినిధులు, శాస్త్రవేత్తలు కలిసి నల్లవాగు ప్రాజెక్టును తిలకించారు. నీటి పారుదల శాఖ ఈఈ విజయ్‌కుమార్, అధికారులతో మాట్లాడి ప్రాజెక్టు నిర్మాణం, ఆయకట్టు విస్తీర్ణం, పంటల సాగు వివరాలు, స్థితిగతులు తెలుసుకున్నారు. ఉగాండ దేశంలో నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణం కోసం అధ్యయనం చేశారు.

రైతులతో మాట్లాడి..

నల్లవాగు ప్రాజెక్టు వద్ద కార్లలో వచ్చిన ఉగాండ దేశ ప్రతినిధులను చూసిన స్థానికులు, రైతులు అక్కడికి చేరుకొని ఆసక్తిగా చూశారు. ఈ సందర్భంగా నీటి పారుదల శాఖ అధికారులు ఉగాండ ప్రతినిధులను శాలువలతో సన్మానం చేశారు. కార్యక్రమంలో డీఈఈ పవన్‌కుమార్, ఏఈలు సూర్యకాంత్, రవి, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల ఆరుగురు ఆత్మహత్య

భార్య అనారోగ్యం తట్టుకోలేక భర్త


మహేశ్(ఫైల్)

చిలప్‌చెడ్(నర్సాపూర్):భార్య అనారోగ్యంతో ఉందని తట్టుకోలేక భర్త ఆత్మహత్య బలవర్మణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండల కేంద్రమైన చిలప్‌చెడ్‌లో చోటు చేసుకుంది. ఎస్ఐ యాదయ్య కథనం మేరకు.. చిలప్‌చెడ్ గ్రామానికి చెందిన చాకలి మహేశ్(33) డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. భార్య సావిత్రి కొద్ది రోజులుగా అనారోగ్యం బాగా లేకపోవడంతో తల్లిగారి ఊరైన కాద్లూర్‌లో ఉంటుంది. భార్య అనారోగ్యం విషయమై తరుచూ బాధపడుతుండేవాడు. శుక్రవారం తన పాలివారైన చాకలి చంద్రయ్య ఇంటికెళ్లాడు. అతడు భోజనం చేసే సమయంలో లోపలి గదిలోకి వెళ్లిన మహేశ్ చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చంద్రయ్య అరవడంతో ఇరుగు పొరుగు వారు వచ్చి గది తలుపులు తెరిచి చూడగా అప్పటికే మహేశ్ మృతి చెందాడు.

అప్పుల బాధతో వ్యక్తి...


బర్ల క్రిష్ణ(ఫైల్)

కౌడిపల్లి(నర్సాపూర్): ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల కేంద్రమైన కౌడిపల్లిలో చోటు చేసుకుంది. శుక్రవారం స్థానిక ఎస్ఐ రంజిత్‌రెడ్డి కథనం మేరకు.. కౌడిపల్లి గ్రామానికి చెందిన బర్ల క్రిష్ణ (44) సెంట్రింగ్ పనితోపాటు వ్యవసాయం ఇతర పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవలె కుటుంబ అవసరాలు, వ్యవసాయం, సెంట్రింగ్ డబ్బా కోసం అప్పులు చేశాడు. అప్పులు తీర్చేమార్గం లేక మానసిక ఆందోళనకు గురై గురువారం ఫోన్‌ను కుదువపెట్టాడు. ఈ విషయం కుటుంబ సభ్యులకు తెలియడంతో మనస్తాపం చెంది ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. రాత్రి వరకు రాకపోడంతో బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం ఉదయం పొలం సమీపంలో చెట్టుకు ఉరి వేసుకొని కనిపించాడు. మృతుడి భార్య శోభ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చెరువులో దూకి యువకుడు


లక్ష్మణ్ (ఫైల్)

అల్లాదుర్గం(మెదక్): చెరువులో దూకి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అల్లాదుర్గంలో ఆలస్యంగా వెలుగుచూసింది. శుక్రవారం ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి కథనం మేరకు.. అల్లాదుర్గం గ్రామానికి చెందిన ఎంబరి లక్ష్మణ్(23) తండ్రి చనిపోవడంతో తల్లితో కలిసి కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నారు. దసరా పండుగకు బట్టలు కొనేందుకు 10 రోజుల కిందట లక్ష్మణ్ ఇంటి నుంచి వెళ్లాడు. కూలీ పని చేస్తాడు కాబట్టి సంగారెడ్డిలోనే పని చేసుకుంటున్నాడేమోనని తల్లి భావించింది. అల్లాదుర్గం పటేల్ చెరువులో దుర్వాస రావడంతో స్థానికులు చూసి లక్ష్మణ్‌గా గుర్తించి కుటుంబీకులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆర్థిక ఇబ్బందులతో తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మనస్తాపానికి గురై..


శ్రీరామ్ మహేశ్ (ఫైల్)

కొండపాక(గజ్వేల్): అప్పుల బాధతో మనస్తాపానికి గురై వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుకునూరుపల్లి ఎస్సై కథనం మేరకు.. మండల కేంద్రమైన కొండపాకకు చెందిన శ్రీరామ్ మహేశ్(38) గ్రామంలో మంగళి వృత్తిని నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గృహ నిర్మాణం కోసం తెలిసిన వారి వద్ద నుంచి రూ. 3లక్షలు అప్పులు చేశాడు. అప్పుల తీర్చే మార్గం లేక మనస్తాపానికి గురై శుక్రవారం ఇంట్లో ఉరివేసుకున్నారు. మృతుడి భార్య రమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నింద వేయడంతో భవనంపై నుంచి దూకి వ్యక్తి..


శ్యామ్ ప్రసాద్(ఫైల్)

పటాన్‌చెరు టౌన్ : భవనంపై నుంచి దూకి యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామానికి శ్యామ్ ప్రసాద్(26) ఐనోల్ గ్రామం టీఆర్ఆర్ కళాశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో వైద్యసేవలు పొందేందుకు రెండు రోజుల నుంచి అక్కడే ఉంటున్నాడు. శిబిరం వద్ద సెల్‌ఫోన్లు చోరీ కావడంతో స్థానికంగా ఉన్న శ్యామ్ ప్రసాద్‌ను అనుమానించారు. దీంతో మనస్తాపం చెంది అక్కడే ఓ భవనం నాలుగో అంతస్తు నుంచి గురువారం రాత్రి దూకాడు. తీవ్రగాయలు కావడంతో బీరంగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. శుక్రవారం మృతుడి సోదరుడు ప్రభాకర్ ఇచ్చిన ఫిర్యాదు పోలీసులు కేసు నమోదు చేశారు.

భూ వివాదంతో రైతు..

రామాయంపేట(మెదక్): ఉరి వేసుకొని రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ బాలరాజ్ కథనం మేరకు... ఝాన్సిలింగాపూర్ గ్రామానికి చెందిన రైతు ఎర్ర అశోక్ (38)కి భార్య బాబాయితోపాటు ఇద్దరు కూతుర్లు ఉన్నారు. అశోక్‌కు తన పాలివారికి కొంత కాలంగా భూ వివాదం నడుస్తోంది. గ్రామంలో పలుమార్లు పంచాయతీలు నిర్వహించినా సమస్య పరిష్కారం కాలేదు. ఈ బాధతో అశోక్ పంట చేను వద్దకు వెళ్లి చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భూమి గొడవతో తన భర్తను చంపారని మృతుడి భార్య, పిల్లలు విలపించారు. తమకు న్యాయం జరిగే వరకు ఉరుకోమని మృతదేహంతో ఆందోళన చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.